సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 12 । జూలై । 2024



అభివృద్ధి దిశ అడుగులు

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పీఠం అధిష్టించాక కొడంగల్ నియోజకవర్గం కొత్త రూపును సంతరించుకుంది. 10లో▸



గాలి వీస్తే అంధకారమే!

వర్షాకాలం వేళ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ముందస్తు చర్యలు తీసుకోవడం లేదు. 10లో▸



పాపం మూగజీవాలు

ప్రకృతి విపత్తులు, మానవ తప్పిదాల కారణంగా మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. 11లో▸

న్యూస్‌రీల్

గురునాథ్‌రెడ్డిని కలిసిన జైళ్లశాఖ ఐజీ



కొడంగల్: రాష్ట్ర పోలీస్ హౌసింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్ రెడ్డిని జైళ్ల శాఖ ఐజీ మిశ్రా గురువారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలుతెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కుల్కచర్ల: ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీలో ప్రవేశాలకు అర్హత గల విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని కుల్కచర్ల కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. కుల్కచర్లలోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సీఈసీలో మిగిలి ఉన్న 10 సీట్లకు గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లి లేదా తండ్రి లేని విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

మెడికల్ కళాశాలకు స్థల పరిశీలన



కొడంగల్: మండలంలోని అప్పాయిపల్లి సర్వే నంబర్ 19లో మెడికల్ కళాశాలకు అవసరమైన స్థలాన్ని భూసేకరణ అధికారి, తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులు భూములకు సంబంధించిన హద్దులను గుర్తించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్‌ఐ శ్రుతి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన పీఎన్‌ఆర్



కేటీఆర్‌తో పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

కొడంగల్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి గురువారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిశారు. నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిణామాల గురించి వివరించారు. ప్రొటోకాల్ లేకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని కేటీఆర్‌కు చెప్పారు. బొంరాస్‌పేట మండలం సోషల్ మీడియా ఇన్‌చార్జ్ నెహ్రూ నాయక్ భార్య సుమిత్రా బాయి ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయిన విషయం తెలుసుకున్న కేటీఆర్ నెహ్రూ నాయక్‌ను హైదరాబాద్‌కు పిలిపించుకొని పరామర్శించారు. పార్టీ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కౌన్సిలర్ మధు యాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, మాజీ సర్పంచ్ చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహ సిబ్బందికి వైద్య పరీక్షలు

డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్‌కుమార్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న పల్వన్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని కేజీబీవీని గురువారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వంట గది, భోజనశాల, నీటి సరఫరా పైప్‌లైన్‌ను పరిశీలించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అన్ని వసతి గృహాల్లో పారిశుద్ధ్యం, నీటి వసతిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అలాగే సిబ్బంది, వంట నిర్వాహకులకు ఏమైన అంటువ్యాధులు ఉన్నాయో తెలుసుకునేందుకు నేటి నుంచి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంటువ్యాధులు ఉన్నట్లు తేలితే వారి నుంచి విద్యార్థులకు సోకకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సిబ్బంది, వంట నిర్వాహకులకు రక్త పరీక్షలు చేశారు.



వన్యప్రాణులపై వేటగాళ్ల పంజా



కొటాలగూడం సమీపంలో వన్యప్రాణుల కోసం వలలు ఏర్పాటు చేస్తున్న వేటగాళ్లు

వేటకుక్కలు, ఉచ్చులకు బలవుతున్న పశుపక్ష్యాదులు

- దట్టమైన అడవిలో క్రూర చర్యలు
- దామగుండం, కండ్లపల్లి ఫారెస్ట్, మీర్జాపూర్ శివారులో ఇదే తంతు
- పట్టించుకోని ఫారెస్ట్ అధికారులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు

పూడూరు: జిల్లాలో వన్యప్రాణులకు రక్షణ లేకుండా పోయింది. నిత్యం పదుల సంఖ్యలో వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్నాయి. వీటిని కంటికి రెప్పలా రక్షించాల్సిన అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయాలన్నీ తెలిసినా పోలీసులు తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా పూడూరు మండల పరిధిలోని ఫారెస్ట్ ప్రాంతమంతా దట్టమైన అడవిగా ఎదిగింది. దీంతో అనేక జాతుల పశుపక్ష్యాదులు ఇక్కడ స్థిర నివాసం ఏర్పరచుకున్నాయి.

వేట నిత్యకృత్యం

కండ్లపల్లి రిజర్వ్ ఫారెస్ట్, మీర్జాపూర్, కొటాల గుడం, సోమన్‌గుర్తి గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతంలో వేట నిత్యకృత్యంగా మారింది. ఆటోలు, జీపులు ఇతర వాహనాల్లో వలలు, ఉచ్చులు, ఆయుధాలు పెట్టుకుని కుక్కల గుంపులతో వస్తున్నారు. జింకలు, కుందేళ్లు, అడవి పందులు కనిపించగానే కొంత దూరంలో వలలు, ఉచ్చులు అమర్చి కుక్కలను వదిలేస్తున్నారు. వీటి బారినుంచి రక్షించుకునేందుకు పరిగెత్తిన వన్యప్రాణులు వలలో చిక్కి.. వేటగాళ్ల వేటుకు బలవుతున్నాయి. నెమళ్లు, బుర్క పిట్టలు, గోరువంకలు తదితర పక్షులను సైతం వదలడం లేదు.



వేటాడిన జంతువులను సంచుల్లో కుక్కి ట్రాలీలో తరలిస్తున్న వేటగాళ్లు

ఫిర్యాదు చేసినా..

మీర్జాపూర్, కొటాలగూడం, కండ్లపల్లి శివారులోకి వలలతో వచ్చిన వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడుతున్నారని గురువారం మధ్యాహ్నం పలువురు రైతులు, పశు కాపరులు ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వేటగాళ్లను అడ్డుకునేందుకు ప్రయత్నించగా తమను భయభ్రాంతులకు గురిచేశారని చెప్పారు. కానీ అధికారులు స్పందించకపోవడంతో పందులు, కుందేళ్లను పట్టుకుని వెళ్లారు.

సరదాగా వచ్చి.. అడవిలో దూరి..

దామగుండం అటవీ ప్రాంతం చుట్టూ వందలాది విలాసవంతమైన ఫాంహౌస్‌లు, రిసార్టులు వెలిశాయి. సరదాగా ఇక్కడకు వచ్చే వారు అడవిలోకి దూరి రాత్రి, పగలు అనే తేడా లేకుండా తుపాకులతో వన్యప్రాణులను వేటాడుతున్నారు. వేటగాళ్లు సైతం ఇదే స్థాయిలో రెచ్చిపోతున్నారు. ఎక్కడపడితే అక్కడ వలలు, ఉచ్చులు బిగించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీరిలో కొంతమంది నాటు తుపాకులు, విషాహారాన్ని సైతం వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రూపులుగా వస్తున్న వేటగాళ్లు కనిపించిన జీవిని వెంటపడి తరుముతున్నారు. ఆయుధాలతో మట్టుబెట్టి ఆటోలలో తరలిస్తున్నారు.

అధికారుల జాడ లేదు

కండ్లపల్లి, మీర్జాపూర్, కొటాలగూడం, దామగుండం అటవీ ప్రాంతంలో నిత్యం వన్యప్రాణులను వేటాడుతున్నారు. అటవీ జంతువులకు రక్షణ లేకుండా పోయింది. పరిసర ప్రాంత రైతులు అడ్డుకునేందుకు వెళ్తే వేటగాళ్లు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దామగుండం ప్రాంతంలో రాత్రి వేళ తరచూ పెద్దపెద్ద శబ్దాలు వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వన్యప్రాణులను రక్షించాలి.

– మల్లేశం పటేల్, సినిమా సెన్సార్ బోర్డు మెంబర్



లష్కర్‌గూడలో గీత కార్మికులతో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

గీత కార్మికులకు లైఫ్ సేవ్ కిట్స్

- 14న సీఎం చేతుల మీదుగా పంపిణీ ప్రారంభం
- లష్కర్‌గూడలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ శశాంక

అబ్దుల్లాపూర్‌మెట్: తాటి చెట్లు ఎక్కే క్రమంలో కల్లు గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా లైఫ్ సేవ్ కిట్స్ పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. రాష్ట్ర వ్యాప్తంగా గీత కార్మికులకు వీటిని అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 14న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో నిర్వహించే ఈ కార్యక్రమం కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్సైజ్, రెవెన్యూ, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో కలిసి గురువారం కలెక్టర్ శశాంక వేదిక స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పలువురు గీత కార్మికులకు లైఫ్ సేవ్ కిట్స్ అందించి ప్రయోగాత్మకంగా తాటి చెట్లు ఎక్కించారు. లైఫ్ సేవ్ కిట్స్ ధరించడంలో ఏమైనా ఇబ్బందులున్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి హాజరయ్యే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

చదువుతోనే జీవితంలో మార్పు

ఇబ్రహీంపట్నం: చదువే జీవితంలో మార్పు తీసుకొస్తుందని.. విద్యార్థులు మనసు పెట్టి కష్టపడి చదవాలని కలెక్టర్ శశాంక సూచించారు. ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వాస్పత్రి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చదవుతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు పెరుగుతుందని.. భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందన్నారు. పదో తరగతి ప్రథమ మెట్టులాంటిదని.. నైపుణ్యాభివృద్ధిని పెంచుకోవాలన్నారు. విద్యార్థుల వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఆన్‌లైన్ ప్రక్రియకు సంబంధించి కంప్యూటర్ ఆపరేటర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి దరఖాస్తుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం సహించం

ఇబ్రహీంపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో మందులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆయన ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ వెంకటమ్మ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్



రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, బ్యాంక్ అధికారులు

లక్ష్యం.. రూ.7,528.45 కోట్లు

- జిల్లా వార్షిక రుణ ప్రణాళికను ప్రకటించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.7,528.45 కోట్లుగా నిర్దేశించామని, బ్యాంకర్లు తమ లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. గురువారం కలెక్టర్ తన చాంబర్‌లో బ్యాంకర్లతో రుణాల లక్ష్య సాధనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.7,528.45 కోట్లు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని బ్యాంకర్లకు ఆదేశించారు. పంట రుణం కింద రూ.3,434.23 కోట్లు, ఇతర వ్యవసాయ రంగానికి రూ.725.51 కోట్లు, అనుబంధ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.565.05 కోట్లు, విద్యా, గృహ నిర్మాణం, ఇతర రంగాలకు రూ. 2,803.66కోట్లు రుణంగా నిర్దేశించామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వరి పంట రుణ పరిమితి ఎకరాకు రూ.45 వేలు, పత్తి పంటకు రూ.46వేలు, కంది పంటకు రూ.24 వేలు నిర్దేశించినట్లు వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ సుధీర్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, నాబార్డు డీడీఎం అఖిల్, ఆర్‌బీఐ ఎల్‌డీఓ గోమతి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ -1 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

- మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి హన్మంత్‌రావు
- 22నుంచి శిక్షణ తరగతులు

అనంతగిరి: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్ -1 మెయిన్స్ పోటీ పరీక్ష కోసం సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి హన్మంత్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అర్హులైన మైనార్టీ ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బుద్ధులు, జైనులు, పార్శీలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, 3వ ఫ్లోర్, జామియా నిజాం కాంప్లెక్స్, గన్‌ఫౌండ్రీ హైదరాబాద్ నందు సమర్పించాలన్నారు. జూలై 22 నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు ల్యాండ్ లైన్ నంబర్ 040–23236112లో సంప్రదించాలన్నారు.

వ్యాపార రంగంలో రాణించాలి

- డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్
- స్వయం ఉపాధి పథకాలపై దివ్యాంగులకు శిక్షణ

అనంతగిరి: దివ్యాంగులు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ సూచించారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గురువారం వికారాబాద్‌లో రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవించే నిరుపేద దివ్యాంగులను గుర్తించి, వారి ప్రతిభ ఆధారంగా ఆర్థిక చేయూత ఇస్తామన్నారు. ప్రభుత్వం గ్రూపుల వారీగా ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. సదరం సర్టిఫికెట్ ఉంటే పింఛను వస్తుందని అన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ అర్హులైన దివ్యాంగులకు రూ. 25 వేల ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు పీఎన్ శ్రీనివాస్, క్లస్టర్ మేనేజర్ అరుణ్ ప్రసాద్ రెడ్డి, జిల్లా కో ఆర్డినేటర్ రామేశ్వర్, మెప్మా పీడీ రవికుమార్, జీఎం ఇండస్ట్రియల్ వినయ్ కుమార్, ఐకేపీ పీడీఎం నర్సింలు, ఐసీడీఎస్ ఎఫ్‌ఆర్‌ఓ వెంకటేష్, కమ్యూనిటీ మెంటర్స్ సంజీవరావు, శ్రీశైలం, యాదయ్య, లబ్ధిదారులు అలవేలు, మాధవి, సునీత, రవీందర్, మల్లేశం, భరత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్

వరుస చోరీలు.. జనం బెంబేలు

- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- పగలు రెక్కీ.. రాత్రి దొంగతనాలు
- చర్యలు తీసుకోవాలని ప్రజల విన్నపం

పరిగి: మున్సిపాలిటీ తోపాటు మండలంలో దొంగతనాలు హడలెత్తిస్తున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. అందినకాడికి దోచుకెళుతున్నారు. వరుస చోరీలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పదిహేను రోజులకు ఒక్కసారి దొంగలు తెగబడుతున్నారు. ఆనవాళ్లు దొరక్కుండా జాగ్రత్త పడుతున్నారు. దొంగతనాల్లో ఆరితేరిన వారి పనేనని ప్రజలు అంటున్నారు.

తాళం ఉంటే అంతే..

తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. పగటి పూట రెక్కీ నిర్వహించి రాత్రి వేళ పని కానిచ్చేస్తున్నారు. అంతేకాకుండా కొత్తగా ఇళ్ల నిర్మాణం జరిగే చోట వాటి యజమానులు విలువైన వస్తువులను ఉంచుతున్నారు. దొంగలు వాటిని కూడా వదలడం లేదు. పోలీసులు పాత నేరస్తులపై నిఘా పెట్టకపోవడం, కొత్త వ్యక్తుల సంచారంపై దృష్టి సారించక పోవడంతోనే దొంగతనాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళ పెట్రోలింగ్ సరిగ్గా నిర్వహించడం లేదని అంటున్నారు.

ఇటీవల జరిగిన సంఘటనలు

- పరిగి పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఒకే రోజు రాత్రి ఐదు ఇళ్లల్లో దొంగతనం జరిగింది. 15 తులాల బంగారం, రూ.1.2 లక్షల నగదు దోచుకెళ్లారు.
- రాపోల్ గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో దొంగతనం జరిగింది. పౌష్టికాహారం తోపాటు గుడ్లు, సిలిండర్‌ను ఎత్తుకెళ్లారు.
- మల్కాపూర్ సమీపంలోని వెంచర్‌లో ఇంటి నిర్మాణం కోసం ఉంచిన రూ.70 వేల విలువ చేసే పాల్ సీలింగ్ షీట్లు, వస్తువులను ఎత్తుకెళ్లారు. ఇదే ఇంట్లో గతంలో 3.5 క్వింటాళ్ల స్టీల్, సిలిండర్, ఇతర సామగ్రిని చోరీ చేశారు. సీసీ కెమెరాలో నమోదైనా దొంగలు ముఖం కనిపించకుండా జాగ్రత్త పడ్డారు.
- మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో పట్టణ ప్రకృతి వనం చుట్టూ పైపులతో గోడను నిర్మించారు. దొంగలు గోడను పగులగొట్టి పైపులను అపహరించారు.
- పలుచోట్ల చిన్న చిన్న దొంగతనాలు జరుగుతున్నా అవి పోలీస్‌స్టేషన్ దాకా వెళ్లడం లేదు.



పరిగి టీచర్స్ కాలనీలోని ఓ ఇంట్లో దొంగలు పడి చిందరవందరగా పడేసిన దుస్తులు (ఫైల్)

నిఘా పటిష్టం చేస్తాం



మండలంలో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. పట్టణానికి దూరంగా ఉన్న ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. నిత్యం గస్తీలు నిర్వహిస్తున్నాం. దొంగలను త్వరలోనే పట్టుకుంటాం. ఊరికి, శుభకార్యాలకు వెళ్లే వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. బంగారు ఆభరణాలు, డబ్బు, విలువైన వస్తువులను ఇళ్లల్లో ఉంచుకోరాదు.

– శ్రీనివాస్, సీఐ, పరిగి

ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

కలెక్టర్, ఎస్పీని కలిసిన మాజీ ఎమ్మెల్యే

అనంతగిరి: వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గురువారం పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి వారిని సన్మానించారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్షలు



దీక్షలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్

అనంతగిరి: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, తదితర సమస్యల సాధనకు టీచర్స్, హెల్పర్స్ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 6వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్స్‌కు రూ.లక్ష ఇవ్వాలని కోరారు. వాలంటరీ రిటైర్మెంట్ స్కీం ఏర్పాటు చేయాలని కోరారు. ఇందులో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వాలీబాయి, దుర్గమ్మ, ఖాజాబీ, అనసూయ, యాదమ్మ, బసమ్మ, జయలక్ష్మి, అనంతమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే చర్యలు



కూల్చిన ప్రహరీని పరిశీలిస్తున్న తహసీల్దార్

పరిగి: ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆనంద్ రావు హెచ్చరించారు. పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డు ప్రహరీని కొందరు ధ్వంసం చేసి, గోదాంను కల్లు కాంపౌండ్ మార్చిన నేపథ్యంలో.. గురువారం ఆయన మార్కెట్‌ను పరిశీలించారు. కల్లు తాగేందుకు ఇక్కడికి ఎవరినీ రానియొద్దని కల్లు వ్యాపారులకు సూచించారు. మార్కెట్ యార్డును నిత్యం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంత జరుగుతున్నా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో కమిషనర్ వెంకటయ్య ఉన్నారు.

నిబంధనలు తప్పనిసరి

తూనికలు, కొలతల శాఖ అధికారి రియాజ్ అలీఖాన్



మోమిన్‌పేటలో హార్డ్‌వేర్ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

మోమిన్‌పేట: ప్రతి వ్యాపారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి రియాజ్ అలీఖాన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నాలుగు కిరాణ షాపులను, ఒక హార్డ్‌వేర్ షాపు, పెట్రోల్ పంపులను తనిఖీ చేశారు. అందులో భాగంగా కిరాణ దుకాణాల్లో కాలం చెల్లిన మిక్చర్ ప్యాకెట్లు ఉండగా కేసులు నమోదు చేసి ఫైన్ వేశామన్నారు. హార్డ్‌వేర్‌లో నకిలీ వస్తువులను గుర్తించి కేసు నమోదు చేశారు. ఎక్కడైన దుకాణాల్లో క్వాలిటీ లేని వస్తువులను అమ్మితే వినియోగదారులు తమకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఏ వహీద్, లైసెన్స్ హోల్డర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి గల్లంతు

జీవన్గీ కాగ్నా చెక్ డ్యాంలో ఘటన



హాజీ (ఫైల్)

బషీరాబాద్: చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు చెక్ డ్యాంలో గల్లంతైన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జీవన్గీ బర్కల్‌కు చెందిన హాజీ(30) అనే యువకుడు మంతట్టి రమేష్, మరోవ్యక్తితో కలిసి చేపల వేటకు కాగ్నా చెక్ డ్యాంకు వెళ్లారు. ఇద్దరు కొంత దూరంలో చేపల వేట చేస్తుండగా, హాజీ మరో చోటుకు వెళ్లాడు. కొంత సమయానికి వారు చూడగా ఒడ్డుకు హాజీ విడిచిన బట్టలు, చెప్పులు మాత్రమే కనిపించాయి. మనిషి కనిపించక పోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులకు, గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. ఈత వచ్చిన కొంత మంది చెక్ డ్యాంలోకి దిగి సాయంత్రం వరకు గాలించిన ఆచూకీ లభ్యం కాలేదు. హాజీకి భార్య నసీమా, పిల్లలు సానియా, రఫీక్ ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని బషీరాబాద్ ఎస్ఐ రమేష్‌కుమార్ తెలిపారు.

అభివృద్ధి దిశగా అడుగులు

ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఇదివరకే సీఎం రేవంత్‌రెడ్డి వాటికి నిధులు కేటాయించారు. అధికారులు ప్రణాళికబద్ధంగా సర్వేలు చేసి ఆయా నిర్మాణాలకు మార్గం సులువు చేస్తున్నారు. దీంతో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

- సర్వేలతో కొడంగల్‌వాసుల్లో గంపెడాశలు
- సీఎం ఇలాకాలో కొనసాగుతున్న పనులు



నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం సర్వే చేస్తున్న అధికారులు



రోడ్డు విస్తరణకు సర్వే..

దుద్యాల్: గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిన కొడంగల్ నియోజకవర్గం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పీఠం అధిష్టించాక కొత్త రూపును సంతరించుకుంది. దీనికి నిదర్శనమే రూ.వేల కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ అభివృద్ధికి రూ.4 వేలకు పైగా కోట్లను కేటాయించారు. ఇందులో నారాయణపేట్-కొడంగల్- మక్తల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కింద 1.30 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడం, వికారాబాద్ నుంచి రాయిచూర్ రైల్వే లైన్, అన్ని కులాలకు సంక్షేమ వసతి విద్యాలయాలు తదితర పనులకు చేపడుతున్నారు. స్థానిక నేత ముఖ్యమంత్రి కావడంతో కొడంగల్ అభివృద్ధిలో పరుగులు పెడుతుందని స్థానికులు గంపెడాశలు పెట్టుకున్నారు.

సాగు నీటి వెతలు తీరేనా

నియోజకవర్గంలో కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల్, దౌల్తాబాద్, మద్దూర్, కోస్గి, గుండుమాల్, కొత్తపల్లి మండలాలు ఉన్నాయి. కొడంగల్‌కు చెందిన పెద్ద చెరువు కింద దాదాపు 300 ఎకరాలు, దుద్యాల మండలం హస్నాబాద్ చెరువు కింద వెయ్యి ఎకరాలు, దౌల్తాబాద్ చెరువు కింద దాదాపు 500లకు పైగా, బొంరాస్‌పేట చెరువు కింద దాదాపు 400, కోస్గి మండలం సర్జాఖాన్‌పేటకు చెందిన చెరువుకు కింద దాదాపు 400 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తయితే దాదాపు 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది.

కలగా రైల్వే లైన్

కొన్ని ఏళ్లుగా కొడంగల్ మీదుగా రైల్వే లైన్ ఏర్పాటు చేస్తామని రాజకీయ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆయా ఎన్నికల ప్రచారాలలో హామీలు ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాకా వికారాబాద్-కొడంగల్-రాయిచూర్ రైల్వే లైన్ సర్వే పనులు ప్రారంభమయ్యాయి. ఇది ఎప్పుడు అందుబాటులోకి వస్తుందని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

రోడ్లకు మహర్దశ

నియోజకవర్గంలోని అధిక సంఖ్యలో గ్రామాలకు రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గిరిజన తండాలకు రోడ్ల సౌకర్యం కోసం కోట్ల రూపాయల నిధులు విడుదల చేశారు. దీంతో నియోజకవర్గంలోని ప్రతి పల్లెకు, గూడేనికి, తండాకు సింగిల్, డబుల్ రోడ్ల సౌకర్యం కల్పించనున్నారు. వీటికి సంబంధించి శంకుస్థాపన కూడా పూర్తయ్యాయి.

అన్ని కులాలకు ఒకే గురుకులం

అన్ని కులాలకు చెందిన గురుకుల పాఠశాలలను ఒకే దగ్గర నిర్మించాలనే ఉద్దేశంతో పైలెట్ ప్రాజెక్ట్ కింద కొడంగల్ మండలంలోని పాతకొడంగల్ గ్రామ శివారులో స్థలాన్ని కేటాయించారు. రాష్ట్రంలోనే ప్రథమంగా ఈ పైలెట్ ప్రాజెక్ట్ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అందుకు గాను సర్వేలు చకచక జరుగుతున్నాయి. నియోజకవర్గం ఇలా అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో అడుగులేయడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కాటేసిన కంచె

- వేటకు వెళ్లి విద్యుదాఘాతంతో నవ యువకుడి దుర్మరణం
- నంద్యానాయక్‌తండాలో విషాదం

బషీరాబాద్: అడవి జంతువుల నుంచి రక్షణ కోసం పంటపొలానికి వేసిన కరెంటు కంచె ఓ నవ యువకుడిని బలిగొంది. అర్ధరాత్రి వేటకు వెళ్లి ఫెన్సింగ్ గమనించకుండా పొలం దాటుతుండగా కాళ్లకు తీగలు తాకి విద్యుదాఘాతంలో అక్కడికక్కడే మత్యి చెందిన దుర్ఘటన బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామర్‌చెడ్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రమేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యానాయక్‌తండాకు చెందిన రాథోడ్ శంకర్, శాంతిబాయి కొడుకు రాథోడ్ అవినాష్(19) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే బుధవారం రాత్రి కుందేళ్ల వేట కోసం తండాకు చెందిన ఇద్దరు స్నేహితులతో కలిసి అవినాష్ దామర్‌చెడ్ గ్రామశివారులోని పొలాల్లోకి వెళ్లారు. గ్రామానికి చెందిన జోగి బలరాం అనే రైతు అడవి పందుల బెడదతో పంటను కాపాడుకోవడానికి పొలం చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేసుకున్నాడు. అయితే వేటకోసం వచ్చిన ముగ్గురు యువకుల్లో అవినాష్ ముందుగా పొలంలోకి వెళ్లడానికి గట్టు దాటుతుండగా కాళ్లకు కంచె తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్నేహితుల కళ్ల ముందే విద్యుత్ షాక్‌తో అతడు మృతి చెందాడు.



రాథోడ్ అవినాష్ (ఫైల్)

దీంతో మిగతా ఇద్దరు తండాకు చేరుకొని కుటుంబీకులకు చెప్పగా ఘటనాస్థలానికి వెళ్లి విలపించారు. చేతికొచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

రైతుపై ఆగ్రహం

బలరాం పొలంలో విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందడంతో తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మృతుడి తల్లి శాంతిబాయి తన కొడుకు ప్రమాదవశత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడని గురువారం తమకు ఫిర్యాదు చేసినట్లు బషీరాబాద్ ఎస్ఐ రమేశ్‌కుమార్ తెలిపారు. పొలం రైతుపై ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి తాండూరు జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పేకాటరాయిళ్ల అరెస్ట్

తాండూరు రూరల్: మండలంలోని కోటబాసుపల్లి శివారులో పేకాట ఆడుతున్న జూదరులను కరన్‌కోట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని కోత్లాపూర్, ఐనెల్లి గ్రామాలకు చెందిన గరంగపల్లి అంబ్రేష్, వడ్డె ఎల్లప్ప, బోయిని సునీల్, ఈడ్గి శ్రీనివాస్, బోయిని రమేష్, మల్లేశంయాదవ్, వెంకటేష్‌గౌడ్ గురువారం పేకాట ఆడుతున్న సమాచారంతో పోలీసులు స్థావరంపై దాడి చేసి రూ.3,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



తాండూరు: పట్టణ పరిధిలోని తాండూరు – సంగారెడ్డి రోడ్డు విస్తరణ పనులను గురువారం ఆర్అండ్‌బీ శాఖ అధికారులు ప్రారంభించారు. విలియం మూర్ చౌరస్తా నుంచి తాండూరు మండలం అంతారం అవుటర్ రోడ్డు వరకు 16 మీటర్ల వరకు మేర విస్తరించనున్నారు. ఇందులో భాగంగా మూడు కిలోమీటర్ల రోడ్డు పనులను అధికారులు ప్రారంభించారు.

నెహ్రూకు కేటీఆర్ పరామర్శ

బొంరాస్‌పేట: రోడ్డు ప్రమాదంలో భార్యను కోల్పోయిన బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు నెహ్రూనాయక్‌ను మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని కేటీఆర్ నివాసంలో ఆ పార్టీ నాయకులు కలిసి నెహ్రూ పార్టీకి అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా నాయక్‌కు అండగా ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఇందులో పార్టీ నాయకులు మధుయాదవ్, చాంద్‌పాషా ఉన్నారు.



నెహ్రూను అక్కున చేర్చుకున్న మాజీ మంత్రి కేటీఆర్, పక్కన మాజీ ఎమ్మెల్యే పట్నం

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అంకిత్ అనురాగ్

తాండూరు టౌన్: పాత తాండూరులోని ప్రభుత్వ నంబర్ టు పాఠశాలలో నెలకొన్న సమస్యలను స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అంకిత్ అనురాగ్ అన్నారు. గురువారం ఆయన పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం అంకిత్ అనురాగ్ మాట్లాడుతూ.. 560 మంది ఉన్న నంబర్ టు పాఠశాల, ఇంటిగ్రేటెడ్ వసతి గృహంలో కొనసాగుతోందన్నారు. నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు అప్పటి ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు.



విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న అంకిత్‌అనురాగ్

కౌన్సిల్ సమావేశం నిర్వహించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వెంటనే నిర్వహించాలంటూ స్థానిక బీజేపీ నాయకులు కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. గత ఐదు నెలల క్రితం కౌన్సిల్ సమావేశం నిర్వహించారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు సమావేశం నిర్వహించక పోవడంతో అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లో పడ్డాయన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో పలు వార్డుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో డీఈ, శానిటరీ ఇన్స్‌పెక్టర్, ఆర్ఐ, టీఐ వంటి పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వెంటనే వాటిని భర్తీ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంతారం లలిత, కౌన్సిలర్ లావణ్యభద్రేశ్వర్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు అభ్యర్థనపత్రం అందజేస్తున్న నాయకులు

టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

14 క్వింటాళ్ల బియ్యం, రూ.7.5 లక్షల గుట్కా ప్యాకెట్ల పట్టివేత



నవాబుపేట పీఎస్ పరిధిలో పీడీఎస్ బియ్యం పట్టుకున్న పోలీసులు

అనంతగిరి: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం పట్టివేశారు. నమ్మదగిన సమాచారం మేరకు తాండూరు, నవాబుపేట పీఎస్ పరిధుల్లో దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం, గుట్కా విక్రేతలను పట్టుకున్నామని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. తాండూరు పీఎస్ పరిధిలో రూ.7.5 లక్షల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నవాబుపేట పీఎస్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 14.4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎవరైనా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించిన, వ్యాపారం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

తాండూరు టౌన్: నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. గురువారం టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా జరిపిన దాడుల్లో పట్టణంలోని మల్లప్పమడిగ సమీపంలోని పలు దుకాణాల నుంచి రూ.7.5 లక్షల విలువ చేసే గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన అజయ్ సింగ్ ఠాకూర్ వద్ద రూ.1.50 లక్షలు, గుముడాల శ్రీనివాస్, కొకుంట్ల నందు వద్ద రూ.6 లక్షల విలువ చేసే గుట్కాను స్వాధీన పర్చుకున్నట్లు సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశం, సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధి చేయండి

తాండూరు: నియోకవర్గంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం నియోజకవర్గంలో ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్ట్, జుంటిపల్లి ప్రాజెక్ట్, శివసాగర్ ప్రాజెక్టులు ప్రధానంగా ఉన్నాయన్నారు. ప్రాజెక్టులపై పర్యవేక్షణ లేకపోవడంతో ఆయకట్టు రైతులకు సాగునీరు అందడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టుకు అభివృద్ధి చేస్తే వేలాది మంది రైతులకు మేలు జరుగుతోందని మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తదితరులున్నారు.



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, యాదయ్య

గాలి వీస్తే అంధకారమే!

విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ అల్లుకుపోయిన చెట్లను అధికారులు కాలానుగుణంగా తొలగించాలి. ఈ విషయంలో వానాకాలం ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా దాని ఫలితం తీవ్రంగా ఉంటుంది. ఇటీవల మండలంలో విద్యుత్ తీగలపై చెట్లకొమ్మల తొలగింపు నామమాత్రంగా సాగింది.

- చెట్లపొదల్లో చిక్కుకున్న విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు
- సరఫరాకు తీవ్ర అంతరాయం
- పట్టించుకోని అధికారులు



గొల్లగూడలో ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకుపోయిన చెట్లపొదలు

నవాబుపేట: వర్షాకాలం వేళ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మండలంలోని పలు గ్రామాల్లో చెట్లపొదలు ట్రాన్స్‌ఫార్మర్లను అలుముకున్నాయి. పంట పొలాలు, గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ తీగజాతి మొక్కలు మెలిచి వాటిని కప్పేస్తున్నాయి. ఎవరూ వాటిని పట్టించుకోకపోవడంతో పెద్దవై విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగిస్తున్నాయి. మండలంలోని గొల్లగూడ, మైతాప్‌ఖాన్‌గూడ, అక్నాపూర్, ఎల్లకొండ, లింగంపల్లి, నారెగూడ, గంగ్యాడ, చిట్టిగిద్ద, పులుమామిడి తదితర గ్రామాలకు సరఫరా అయ్యే విద్యుత్ వైర్లు చెట్లపొదల్లో చిక్కుకున్నాయి. దాంతో గాలి వీటినప్పుడల్లా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. గాలి మరింత గట్టిగా వీస్తే చెట్ల పొదలు తగిలి మంటలు వ్యాప్తి చెందుతున్నాయి. దాంతో కరెంటు తీగలు తెగిపోయి సరఫరా నిలిచి పోతుంది. మళ్లీ కరెంటు రావాలంటే సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తే కనీసం ఒక్క రోజైనా పడుతుంది.

పలుమార్లు ఫిర్యాదులు

మండలంలో పేరుకుపోయిన విద్యుత్ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశాల్లో విద్యుత్ అధికారులపై ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లు చెట్ల పొదల్లో అల్లుకొని ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేయాలని స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయారు. అయినా పట్టించుకోవడంలేదని విద్యుత్ వినియోగదారులు వాపోతున్నారు.

చేతికందే ఎత్తులో ప్రమాదం

ధారూరు: మండల కేంద్రంలోని పలు వ్యవసాయ పొలాల్లో చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలతో రైతులు భయాందోళన వ్యక్తం చేశారు. ఎడ్లు, ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు చేయాలన్న వేలాడుతున్న తీగలతో అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పనులు చేస్తున్నారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో అధికారి, సిబ్బందికి తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏఈ, సిబ్బందికి హెడ్‌క్వార్టర్ లేకపోవడంతో ఇలా వచ్చి అలా వెళ్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన వేలాడే తీగలను సరిచేసి ప్రాణాపాయం నుంచి తప్పించాలని కోరుతున్నారు.



ధారూరులోని ఓ పొలంలో చేతికి అందే ఎత్తులో వేలాడుతున్న తీగలు

అధికారులు స్పందించాలి

మైతాప్‌ఖాన్‌గూడలో ప్రధాన చౌరస్తాలో ఉన్న విద్యుత్ తీగలు పూర్తిగా చెట్ల మధ్యలో అల్లుకొని ఉన్నాయి. దాని ద్వారా కరెంటు సరఫరాకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. తక్షణమే అధికారులు స్పందించి చెట్లపొదల్లో అల్లుకుపోయిన తీగలను వేరు చేయాలి.

– అనితారంగారెడ్డి, మాజీసర్పంచ్, మైతాప్‌ఖాన్‌గూడ

పిచ్చి మొక్కలతో..

వానలకు గొల్లగూడకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ నీళ్లు చేరుతాయి. ప్రస్తుతం పిచ్చి మొక్కలు కమ్మేశాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు. ఏదైనా జరిగితే అధికారులే బాధ్యత వహించాలి.

– శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్, గొల్లగూడ

సమస్యలను పరిష్కరిస్తాం

మండంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉన్న విషయం వాస్తవమే. ఇది వరకు కొన్ని గ్రామాల్లో పరిష్కరించాం. విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్లను నరికివేయడానికి ప్రస్తుతం నిధులు లేవు. వాటికి ప్రతిపాదనలు పంపాం. తొందరలో చెట్లను తొలగిస్తాం.

– ప్రమోద్, విద్యుత్ ఏఈ

భగీరథ నీరు వృథా

లారీ ఢీకొట్టడంతో గేట్‌వాల్వ్ ధ్వంసం



ఎగిసి పడుతున్న భగీరథ నీరు

బొంరాస్‌పేట: లారీ రివర్స్ తీసుకునే క్రమంలో మిషన్ భగీరథ గేట్‌వాల్వ్‌కు తగిలి నీరు వృథాగా పోతోంది. ఈ సంఘటన గురువారం రాత్రి జాతీయ రహదారి163పై చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రేగడిమైలారం గ్రామానికి చెందిన మంగలి శ్రీనివాస్ లారీని వెనుకకు తీస్తుండగా గేట్‌వాల్వ్ ధ్వంసం అయింది. దీంతో భగీరథ నీరు వృథాగా పారుతోంది. నీరు పైకి ఎగిసిపడుతున్న నేపథ్యంలో పైన ఉన్న పెద్దలైన్ విద్యుత్ స్తంభాలకు తగిలే ప్రమాదం ఉందని వాహనదారులు, గ్రామస్తులు తెలిపారు. గేట్‌వాల్ ధ్వంసం వలన శుక్రవారం కొడంగల్ నియోజకవర్గ పరిధి చాలా గ్రామాలకు భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

వీధి కుక్క దాడిలో చిన్నారికి గాయాలు

కందుకూరు: వీధి కుక్క దాడిలో ఓ చిన్నారికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కందుకూరు చౌరస్తాలోని ఓ వీధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు చౌరస్తాలో ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి సాయిభార్గవి(6)పై వీధి కుక్క దాడి చేసింది. దీన్ని గమనించిన స్థానికులు కుక్కను తరమడంతో ఆ చిన్నారి ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది.